
ప్రజాశక్తి

సోమవారం 15 ఏప్రిల్ 2024 8 పేజీలు

తిరుపతి చిత్తూరు





'ఇండియా'తోనే ప్రత్యేక హోదా సాధ్యం

- జగన్, చంద్రబాబు ఇద్దరూ మోదీకి బానిసలు
- 2.30లక్షల ఉద్యోగాల పైనే మొదటి సంతకం
- ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



శ్రీకాళహస్తి సభలో మాట్లాడుతున్న షర్మిల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

"వైసీపీ అధినేత జగన్.. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇద్దరూ నరేంద్ర మోదీకి బానిసలు... చంద్రబాబు కానీ... జగన్మోహన్ రెడ్డి కానీ ఏ నాడూ ప్రత్యేక హోదా గురించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేదు. నరేంద్ర మోదీ, జగన్, చంద్రబాబు కారణంగానే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా రాలేదు. 'ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి మంత్రివర్గ సమావేశంలోనే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తాం. ఇది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ. ఏపీలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగ సమస్య తీర్చడానికి 2.30లక్షల ఉద్యోగాల భర్తీ ఫైల్‌పై మొదటి సంతకం పెడతాం' అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చెప్పారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారసభలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ... ఏపీ విభజన తరువాత 2014 నుంచి ఐదేళ్ల పాటు చంద్రబాబు నాయుడు... 2019 నుంచి ఐదేళ్ల పాటు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటికీ ప్రత్యేక హోదా గురించి ఎందుకు మాట్లాడలేదని ఆమె ప్రశ్నించారు. ఏపీకి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని నరేంద్రమోదీ మాట తప్పారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడంతో ఏపీలో అభివృద్ధి పనులు మొత్తం ఆగి పోయాయని షర్మిల ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు, దుగ్గిరాజుపట్నం ఓడరేవు, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంటు, మన్నవరం విద్యుత్ ఉపకరణాల తయారీ ప్రాజెక్టు, ఏపీ రాజధాని... అన్ని పనులు ఆపేశారన్నారు. ఏపీకి రాజధాని లేకపోవడం చాలా బాధాకరమన్నారు. చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డి తమ స్వప్రయోజనాల కోసం ఏపీని నరేంద్ర మోదీకి తాకట్టు పెట్టారన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఏపీకి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామన్నారు. ఇపుడు ఇస్తున్న ప్రతి హామీని నెరవేర్చుతామని వైఎస్ షర్మిల చెప్పారు. జగన్ తన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని విస్మరించారన్నారు. పాఠశాల విద్య అభ్యసించే ప్రతి ఒక్కరికీ అమ్మఒడి ఇస్తామని చెప్పిన జగన్... ఆ తరువాత మాట తప్పారన్నారు. ఇంట్లో ఒక్కరికి మాత్రమే ఇపుడు అమ్మఒడి ఇస్తున్నారన్నారు. అది కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకుండా కోత విధిస్తున్నారన్నారు. కుంభకర్ణుడు ఏడాదిలో ఆరు నెలలు మాత్రమే నిద్రపోతారని... అయితే నాలుగన్నరేళ్లు నిద్రపోయిన

2 లో



పుత్తూరులో కూటమికి మద్దతుగా సిపిఎం నాయకుల ర్యాలీ

అన్ని వర్గాల ప్రజలకు చెందిన

గొప్ప వ్యక్తి అంబేద్కర్

చిత్తూరు జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు చెందిన గొప్ప వ్యక్తిని చిత్తూరు జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ విజయ్, మణికంఠ ఛందోలు, డిఆర్ఓ బి.పుల్లయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డిడి డాక్టర్ రాజ్యలక్ష్మి, నగర పాలక సంస్థ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, దళిత, గిరిజన సంఘాల నాయకులతో కలసి భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ సూచించిన మార్గంలో ఆయన ఆశయాలను నెరవేస్తు నేటి యువత మే 13న పోలింగ్ రోజు చిత్తూరు పట్టణంలోని ఓటు హక్కు కలిగిన ప్రజలందరూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకొవాలని కోరారు. దర్గా సర్కిల్ నుండి ఎమ్మెస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. గృహనిర్మాణ సంస్థ పిడి పద్మనాభం, ఏఎస్పీ, డిఎస్పి, సిఐ, ఎస్ఐలు పాల్గొన్నారు. **(మిగిలిన వార్తలు)**

5 లో



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చిత్తూరు కలెక్టర్ సగిలి షన్మోహన్

జగన్ పై దాడిని ఖండిస్తూ నిరసనలు



8 లో

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించని అధికారులు

పనిప్రదేశాల్లో టెంట్, మంచినీరు, సౌకర్యాలు నిల్


కూలీలకు అందని పరికరాలు

మండే ఎండ..

ఉపాధికేదీ అండ..

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండుతున్న ఎండల్లోనే పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు అవస్థలు తప్పడం లేదు. కనీస సౌకర్యాలైన నీడు, నీరు కూడా లేకపోవడంతో కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు మాత్రం ఉదయాన్నే వెళ్లి ఉష్ణోగ్రతలు పెరిగేలోపు పనులు ముగించుకొని రావాలని చెబుతున్నారు. అలాగైతే రోజుకూలి గిట్టుబాటు కాదని కూలీలు

2 లో



ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే వారికే

ఉపాధ్యాయుల మద్దతు : యుటిఎఫ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సిపిఎస్, జీఓ 117 రద్దు, పాఠశాలల విలీనం నిలుపుదల చేయడం, నెలనెలా జీతం సమస్యలతో పాటు ప్రభుత్వ విద్యారంగంను ఏ పార్టీ కాపాడి పరిష్కారం చేస్తోందో ఆ పార్టీకే ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాలని యూటీఎఫ్ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు కోరారు. చిత్తూరు నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ చిత్తూరు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గడచిన విద్యాసంవత్సరం బోధన పనికంటే బోధనేతర పనులకు ఉపాధ్యాయులను వినియోగించడం వల్ల తీవ్రమైన ఒత్తిడితో పనిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రకరకాల యాప్‌లు, శిక్షణల పేరుతో పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను సమాజంలో తప్పుగా చూపే విధానం సరికాదన్నారు. బోధనకే ఉపాధ్యాయులను పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 117, పాఠశాలల విలీనం వల్ల పాఠశాలలలో గందరగోళం ఏర్పడిందని తెలిపారు. పాతపెన్షన్ పునరుద్ధరణ చేయల్సిందేనని చెప్పారు. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించడానికి ప్రత్యేకడ్రైవ్ ఉపాధ్యాయులు చేపట్టాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్.నాయుడు, జీవి.రమణ మాట్లాడుతూ యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు సంవత్సరంలో జరిగే సంబరాలు

2 లో



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే వారికే

ఉపాధ్యాయుల మద్దతు : యుటిఎఫ్

విజయవంతంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర నాయుడు, ఎన్.మణి గండన్, సుధాకర్ రెడ్డి, పిఆర్.మునిరత్నం రెహానా బేగం, రఘుపతి రెడ్డి, దీనావతి, సిపి.ప్రకాష్, రెడ్డప్ప నాయుడు, దక్షిణామూర్తి, సరిత, ఏకాంబరం, ఈశ్వర్ మహేంద్ర, పంటపల్లి సురేష్, గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని ఆ పార్టీల నేతలు పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయ సమావేశం నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు అభ్యర్థి వెలగపల్లి ప్రసాదరావుతో పలువురు నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ... వచ్చేనెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలందరూ కలిసి కట్టుగా పనిచేసి శ్రీకాళహస్తిలో బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి గారిని ఎమ్మెల్యేగా... వెలగపల్లి వరప్రసాద్ రావును ఎంపీగా గెలిపించాలని ముక్త కంఠంతో కోరారు. విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ శ్రీకాళహస్తి కన్వీనరు కోలా ఆనంద్, టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, కండ్రిగ ఉమ, మేఘాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, జనసేన నాయకులు కొట్టే సాయి, రాఘవయ్య, మహేష్, కుమార్, కిరణ్ పాల్గొన్నారు.

జీతాలు కోసం ఎదురుచూపు

ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర రిప్రజెంటేటివ్ లోకేష్ బాబు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నెల మొదలై 15 రోజులు గడుస్తున్నా నేటికీ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు జీతాలు అందలేదని ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర రిప్రజెంటేటివ్ ఈ.లోకేష్ బాబు ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు ఇచ్చే అరకొర జీతాలు కూడా నెల మొదటి రోజుల్లో తీసుకునే పరిస్థితులు ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు లేవని అన్నారు. ఆఖరికి ఉగాది, రంజాన్ వంటి పండుగ రోజుల్లోనూ పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తమ వద్ద పనిచేయించుకోవడంలో కఠినంగా వ్యవహరించే అధికారులు చేసిన పనికి వేతనాలు ఇవ్వడంలో ఇంత నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. వేతనాల కోసం నెలంతా కష్టపడి పనిచేసినా 15వ తేదీ వరకు జీతాలు లేక అవస్థలు తప్పడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'టిడిపిని ఆదరించండి '

ప్రజాశక్తి - రామకుప్పం: గ్రామాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు టిడిపిని ఆదరించాలని మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి,నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చలపతి పేర్కొన్నారు. ఆదివారం బైపరెడ్డపల్లి గ్రామంలో శంఖారావం ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైసీపీ పాలనలో అభివృద్ధి కనబడడం లేదని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా అరకొర లబ్ధి తప్ప పేదల బతుకులు మార్పు రాలేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి చెందాలన్నా పేదరికం నుంచి విముక్తి కలగాలన్న టిడిపి పాలనలోనే సాధ్యమవుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పేదరిక నిర్మూలనకు టిడిపి కూటమితో సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు భారీ మెజారిటీతో ఘనవిజయం అందించాలని కోరారు. రమేష్ బాబు,ముని రెడ్డి, వెంకటరమణ, వెంకటేష్, శ్రీనివాసులు ,నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా'తోనే ప్రత్యేక హోదా సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

జగన్... ఎన్నికల వేళ నిద్ర లేచారన్నారు. చంద్రబాబు హయాంలో 23వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని... అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని జగన్ తన పాదయాత్ర సందర్భంగా నిరుద్యోగులకు హామీ ఇచ్చారన్నారు. అయితే నాలుగన్నరేళ్ళ నిద్రలో ఉన్న జగన్... ఎన్నికల వేళ 6వేల పోస్టులతో దగా డీఎస్సీ నిర్వహించడానికి నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఎవరైనా ఎన్నికలకు రెండు నెలల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తారా అని షర్మిల ప్రశ్నించారు. నిరుద్యోగులను దగా చేయడానికే జగన్ ఈ నాటకం ఆడారన్నారు. గతంలో ప్రభుత్వ చౌక దుకాణాల్లో 11రకాల సరుకులు రేషన్ కార్డుదారులకు అందించే వారన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారన్నారు. ఇలా నిత్యావసర సరుకుల్లో కోత విధించడం వలన పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో ఏడు పర్యాయాలు విద్యుత్ ఛార్జీలు, రెండు సార్లు ఆర్టీసీ ఛార్జీలు పెంచారన్నారు. ప్రస్తుతం సామాన్యులు విద్యుత్ ఛార్జీల భారం మోయలేకున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచడంతో సామాన్యుల బతుకు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. జగన్ పేదలకు సంక్షేమ పథకాలు ఒక చేత్తో ఇచ్చి... రెండు చేతుల్తో వారిని దోచుకు తింటున్నారని ఆమె ఆరోపించారు. ఇక 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే ప్రతి పేద మహిళకు ఏడాది రూ.లక్ష వంతున ఆర్థిక సాయం చేస్తామన్నారు. ఏపీలో ఖాళీగా 2.30లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని షర్మిల హామీ ఇచ్చారు. వద్దులు, వితంతువులకు నెలకు రూ.4వేలు వంతున... ప్రత్యేక ప్రతిభావంతులకు రూ.6వేలు వంతున సామాజిక భద్రత పింఛను అందచేస్తామన్నారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం రూ.5లక్షలు ఆర్థికసాయం చేస్తామన్నారు. ఇల్లు లేని ప్రతి పేదకు పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. ఇక ఓటు తల్లి, చెల్లెలాంటిదని... ప్రతి ఓటరు ఆలోచించి మంచి చేసే వారికి ఓటు వేయాలని షర్మిల విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు, తిరుపతి ఎంపీ అభ్యర్థి డాక్టర్ చింతామోహన్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు, సీపీఎం నేతలు అంగేరి పుల్లయ్య, గంధం మణి, సీపీఐ నేతలు జనమాల గురవయ్య, వైఎస్ మణి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు, సత్యవేడు: సత్యవేడులోని పోలీసుస్టేషన్ సమీపంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల న్యాయయాత్ర సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాత్రమే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పరిశ్రమలు తీసుకొస్తుందని పేర్కొన్నారు. టిడిపి, వైసిపి పార్టీలు ప్రత్యేక హోదాను తీసుకురాకుండా బీజేపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి దిశగా తీసుకుపోవాలంటే ఒక కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలాగురు బాబుని నియోజకవర్గంలోని ప్రజలు ఆశీర్వదించి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం పార్టీ నియోజకవర్గ కార్యదర్శి దాసరి జనార్దన్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరుటౌన్: అధికారంలో వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని హామీ ఇచ్చిన జగన్ రెడ్డి దాని గూర్చి పట్టించుకోలేదని, రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి చేయలేదని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా న్యాయయాత్రలో భాగంగా పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి పుత్తూరులోని కాపీవీధి జంక్షన్‌లో ఆదివారం పర్యటించారు. నగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోచారం రాకేష్‌రెడ్డిని ఆశీర్వదించి ఆదరించాలని ప్రజలను కోరారు. మంత్రిగా రోజా ఉన్న నగరి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ఎమ్మెల్యే హోదాతో భూకబ్జాలు, గ్రామాల నుంచి మట్టి తరలించి అమ్ముకున్నారే తప్ప పేదప్రజలకు అభివృద్ధి చేయడంలో శూన్యం ఆరోపించారు. మిత్రపక్షాల బిజెపి జనసేన టిడిపి వైసిపి పొత్తుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నారని, అలా జరగకుండా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే దీనిని అరికట్టేందుకు వీలవుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, నగరి నియోజకవర్గ అధ్యక్షులు ఆర్.వెంకటేష్, సిపిఐ రాష్ట్ర నాయకులు రామానాయుడు, మహేష్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశభక్తులకు దేశద్రోహులకు మధ్య జరుగుతున్నదని, మద్దతుల్లో మహన్మాది శక్తులను ఓడించాలని ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. ఇండియా కూటమి అభ్యర్థులు రాకేష్‌రెడ్డి పోటీ చేస్తున్నారని ఆయన్ను గెలిపించాలన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

మండే ఎండ.. ఉపాధికేదీ అండ..

అంటున్నారు.

ఎండలకు గడ్డపారలు, సామగ్రి వేడెక్కి చేతులు బొబ్బలు వస్తున్నాయి. మార్చి నుంచి జూన్ రెండో వారం వరకు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ఈ సమయంలో కూలీలకు ఎండల నుంచి ఉపశమనం పొందడానికి తగిన వసతులు కల్పించాలి. వడదెబ్బ తగలకుండా గుడారాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ తిరుపతి జిల్లాలో ఎక్కడా ఇలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఎండల కారణంగా కూలీలు వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది.

అందని పరికరాలు..

ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు ప్రభుత్వమే పరికరాలు అందించేది. గడ్డపారలు, పారలు, ఇనుప తట్టలు, జంగిల్ కటింగ్ కోసం గొడ్డళ్లు, కొడవళ్లు ఇచ్చేవారు. క్రమక్రమంగా అధికారులు పరికరాలను ఇవ్వడం కూడా మానేశారు. ప్రభుత్వం నుంచే రావడం లేదని చెబుతున్నారు. దీంతో కూలీలే పరికరాలు సొంతంగా కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో మార్పులు చేసింది. దీనిలో వేసవి భత్యం ప్రస్తావన లేకపోవడంతో ఈ ఏడాది నుంచి కూలీలు వేసవి భత్యానికి కూడా నోచుకోకుండా పోయారు. తాగునీటి సదుపాయం కల్పించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మండుటెండలో మాడాల్సిందేనా?

వేసవి ఎండలు మండుతున్నాయి. ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పనిచేసేచోట సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు మాత్రం ఉదయాన్నే వెళ్లి ఉష్ణోగ్రతలు పెరిగేలోపు పనులు ముగించుకొని రావాలని చెబుతున్నారు.

తాగునీటికి రూ.5లు ఎక్కడా..

ప్రభుత్వం కూలీలకు తాగునీటి సీసాలు తెచ్చుకోవడం కోసం గతంలో రోజుకు రూ.5లు అదనంగా చెల్లించేది. ఈ సంవత్సరం నుంచి వాటిని కూడా ఎత్తేశారు. ఇక కూలీలకు మజ్జిగ అందించడంలో జాప్యం. అధికారులు స్పందించి వేసవి ఎండలను దష్టిలో పెట్టుకొని పనిచేసే చోట తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

గుడారాల జాడేలేదు...

ఉపాధి హామీ కూలీలు పనిచేసి ఎండలకు అలసిపోతే కాసేపు సేద తీరడానికి, మధ్యాహ్నం భోజన సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి అవసరమైన గుడారాలను ప్రభుత్వమే గతంలో పంపిణీ చేసింది. వాటిని క్షేత్ర సహాయకులు పనిచేసే చోటుకు తీసుకెళ్లి కూలీలకు నీడకోసం గుడారం వేయించేవారు. అయితే ప్రభుత్వం రెండేళ్ల కిందట క్షేత్ర సహాయకులను విధులను నుంచి తొలగించి.. తరవాత మళ్లీ తీసుకుంది. అయితే గతంలో ఇచ్చిన గుడారాలు ఏమయ్యాయో క్షేత్ర సహాయకులకే తెలియడం లేదు. అలాగే పనిచేసే చోట కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్లు ఇచ్చారు. అందులో గాయాలకు కట్టుకట్టడానికి మందులు, దూది, బ్యాండేజ్ ఉండేవి. వడదెబ్బకు గురైన వారికి తాగించడానికి ఓఆర్ఎస్ పాకెట్లు ఉండేవి. ఆ కిట్ల జాడ లేకుండా పోయింది. 2015-16వ సంవత్సరంలో మెడికల్ కిట్లు ఇచ్చారు. తరవాత వాటి పంపిణీని విస్మరించారు.



సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

- అరుణ, ఎంపిడిఓ, బాలాయపల్లి

ఉపాధి హామీ పథకం కూలీలకు పనిప్రదేశాల వద్ద సౌకర్యాలు కల్పించేందుకు ద్వామా పిడి దష్టికి తీసుకువెళ్లి సకాలంలో సమస్యలు పరిష్కరిస్తాం. వేసవిలో కూలీల పట్ల ప్రత్యేకమైన చర్యలు చేపడతాం.

జిల్లా గ్రీవెన్స్ త్రిసభ్య కమిటీ ద్వారా

రూ.35.58లక్షలు నగదు విడుదల

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే

కఠిన చర్యలు తప్పవు : కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : సాధారణ ఎన్నికలు లోక్‌సభ, శాసనసభ 2024 షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై అందిన వివిధ ఫిర్యాదుల పరిష్కారం కొరకు చర్యలు తీసుకున్నామని సదరు నివేదికను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతోందని, అందులో భాగంగా ఆదివారం మధ్యాహ్నం వరకు నివేదికల మేరకు ప్రింట్ మీడియా ద్వారా 253 ఫిర్యాదులు అందగా 251 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని మిగిలినవి పురోగతిలో ఉన్నాయనిపేర్కొన్నారు. కంప్లైంట్ మానిటరింగ్ యాప్, సీఈవో ద్వారా 47 ఫిర్యాదులు అందగా 47 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, పోలీసు ఎన్ఫోర్స్మెంట్ టీమ్స్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి (14.4.2024) వరకు..జిల్లా వ్యాప్తంగా రూ.67.81లక్షలు మేర నగదు, 4713 లీటర్లు విలువ రూ.22.58 లక్షల లిక్కర్, ఇతర వస్తువులను కలిపి మొత్తం రూ.3.38కోట్లు సీజ్ చేయడం జరిగిందన్నారు. సి-విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులు నేటి వరకు మొత్తం 600 కాగా అందులో సరియైన ఫిర్యాదులు 457కుహాజరై పరిష్కరించడమైనదని అన్నారు. ఫిర్యాదు పరిష్కార సరాసరి సమయం సుమారు 31.26 గంటలుగా ఉందని తెలిపారు. 143 ఫిర్యాదులు నిరాధారమైనవిగా గుర్తించామని తెలిపారు. ఎన్జీ ఎస్పీ పోర్టల్ ద్వారా అందిన ఫిర్యాదులు 676 లో 659 పరిష్కరించడం జరిగిందని తెలిపారు. అలాగే ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన 23మంది వాలంటీర్లను తొలగించడం జరిగిందన్నారు. రెగ్యులర్ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలలో భాగంగా 7మందిని సస్పెండ్ చేయడమైనదని, ఒకరిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్స్ చేయడం జరిగిందని, ఒకరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగులు 7మందిని సర్వీసు నుండి తొలగించడం జరిగిందని, ఒకరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా నేటి వరకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై ఏర్పాటు చేసిన అనధికార ప్రకటనలు 30,861 తొలగింపు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ త్రిసభ్య కమిటీ ద్వారా సామాన్య ప్రజలకు, వ్యాపారులకు చెందిన సీజ్ చేసిన నగదు 23 కేసులలో రూ. 42,68,380ని సమీక్షించి నేటి వరకు 20కేసులకు సంబంధించిన మొత్తం రూ.35,58,580లను సంబంధీకులకి తిరిగి అందజేయడం జరిగిందని, జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు ఉంటే చర్యలు తప్పవని వెల్లడించారు.

ప్రముఖ పర్యాటక కేంద్రంలో అటవీశాఖ అధికారుల దౌర్జన్యం

ప్రజాశక్తి- పుత్తూరుటౌన్: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండలం అరణ్యకండ్రిగ పంచాయతీ పరిధి కైలాసనాథ కోనలో పుత్తూరు అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా రోడ్డుపైనే సిమెంట్ బస్తాలు, ఇసుక, సిమెంటు కలుపుతూ నిర్బంధించారు. ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యటక కేంద్రంగా దినదిన అభివద్ధి చెందుతున్న కైలాస నాథకోనకు ఆది,సోమవారాలతో పాటు మిగిలిన రోజుల్లో భక్తులు, పర్యాటకులు వివిధ వాహనాల్లో వస్తుంటారు. అయితే ఆదివారం పుత్తూరు అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా కైలాసకోన లోపలికి వాహనాలను వెళ్లనీకుండా వనక్షేత్రం ఎదురుగా సిమెంట్ బస్తాలను రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో రాకపోకలు ఆగిపోయాయి. ఇది ప్రశ్నించిన భక్తులను



రోడ్డుపై ఇసుక బస్తాలు వేసిన అటవీ శాఖ అధికారులు

పర్యాటకులపై పుత్తూరు అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా మాట్లాడడంతో పాటు కొట్టడానికి వస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు. అటవీశాఖ అధికారులు అటవీశాఖకు సంబంధించిన పార్కును అభివృద్ధి చేసుకోవాలంటే తారురోడ్డుకి అడ్డంగా సిమెంట్ బస్తాలను ఎందుకు పెట్టారని ప్రశ్నిస్తున్నారు. కైలాసనాధుని దర్శనానికి వెళ్లే భక్తులకు ఆటంకం కలిగించి, అవమానించాలనే ఉద్దేశంతోనే పుత్తూరు అటవీశాఖ అధికారులు ఈ ఘటనకి పాల్పడుతున్నారని భక్తులు, పర్యాటకులు ఆరోపిస్తున్నారు. దీనిపై కైలాస నాథకోన దేవాదాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు స్థానిక ఎస్సై లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. కైలాస కోన ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం యాదవ్, ఈవో కష్ణా నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మీనారాయణ సంఘటన స్థలానికి వెళ్లి వెంటనే పనులను ఆపేశారు. పుత్తూరు అటవీశాఖ అధికారుల దౌర్జన్య కాండను ఖండిస్తూ వారిపై చర్య తీసుకోవాలని దేవాదాయ శాఖ మండల సభ్యులు ఆలయ అధికారులు కోరారు.

కారుఢీ..వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పుత్తూరు మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..పుత్తూరు మండలం తడుకు పంచాయతీ పరిధిలోని వేణుగోపాల పురానికి చెందిన బుర్ర సుబ్రహ్మణ్యం (60), నరసింహులు మందడి ఇద్దరూ ఆదివారం తెల్లవారుజామున రాయల్ చెరువు రోడ్‌లో జరిగే సంతలో పొట్టేలు కొనుగోలు చేయడానికి బయలుదేరారు. స్థానిక మజ్జిగ గుంట వద్ద రోడ్డు దాటుకుని, పశ్చిమ ప్రాంతంలో పక్కనే నడుస్తున్న సుబ్రహ్మణ్యంను పుత్తూరు నుంచి తిరుపతికి వెళుతున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పక్కనే ఉన్న నరసింహులు గ్రామస్తులకు సమాచారం అందించాడు. వెంటనే గ్రామస్తులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి, సిసి ఫుటేజ్ ఆధారంతో ప్రమాదానికి గురైన కారును, నెల్లూరు సమీపంలోని తడ వద్ద పట్టుకున్నారు. మృతుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్ మోహన్ తెలిపారు.



మృతి చెందిన సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని గోగినేని పురం వద్ద ఓ ఫ్యాక్టరీ సమీపంలో గుర్తు తెలియని మృత దేహన్ని గుర్తించారు. రూరల్ ఎస్. ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు మృతుడు వయస్సు సుమారు 55 సంవత్సారాలు ఉంటుందన్నారు. మృతుడు నల్లని చొక్కా, ఫ్యాంట్ ను ధరించి ఉన్నాడు అన్నారు. చనిపోయి 3 రోజులు అవుతుందని మొహం ఉబ్బి పోయి ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు 9440796341, 9440796344 కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-పాకాల: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా వుండాలని పాకాల అగ్నిమాపక కేంద్ర అధికారి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం పాకాల అగ్నిమాపక కేంద్రంలో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె విశ్వనాథం, జి రామకృష్ణ, ఆర్ భాస్కర్, ఎస్ మనోహర్ రెడ్డి, బి నాగార్జున, ఎస్ రాజేంద్ర బాబు, జి నరేంద్ర, బి సురేంద్రబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగన్ పై దాడి మరో కోడికత్తి డ్రామా: నరసింహ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సీఎం జగన్ మోహన్ రెడ్డి పై శనివారం రాత్రి జరిగిన దాడి మరో కోడికత్తి డ్రామాగా టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ అభివర్ణించారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దొంగ ఓట్లు, తనకు అనుకూలమైన అధికారులను ఎన్నికల విధుల్లో వేసుకొని రాయి దాడి లాంటి జిమ్మిక్కులతో మళ్లీ అధికారంలోకి రావడానికి జగన్ నాటకాలు వేస్తున్నాడన్నారు. ఇవన్నీ గమనిస్తుంటే అధికారంలోకి రావడానికి జగన్ కుటుంబంలో ఎవరికో ముప్పు వాటిల్లినట్లుగా అనుమానాలు కలుగుతున్నాయన్నారు. తన సొంత రక్షణే చూసుకోకుండా ప్రతిపక్షాలపై నిందలు వేసేయడం సరికాదని, విద్యుత్తు సరఫరా తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జగన్ పై దాడి జరిగిన గంటల్లోనే తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తన అనుచరులతో కలిసికొని చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ బ్యానర్ లను చెప్పులతో కొట్టడం రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళు తున్నామన్నారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు మాట్లాడుతూ అసలు సీఎం జగన్ కు ఏమి తగిలి దెబ్బ తగిలిందో నిగ్గు తేల్చాలన్నారు. పక్కా ప్రణాళికతోనే దాడులు చేయించుకుని ప్రతిపక్షాలపై నెట్టడం వారికి పరిపాటిగా మారిపోయిందన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలంటే డీజీపిని, ఇంటెలిజెన్స్ డిజిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గతంలో తిరుపతిలో చంద్రబాబుపై రాళ్లదాడి జరిగితే సాక్షాదారాలతో సహా ఫిర్యాదు చేస్తే ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఊరూరా తిరుగుతూ సొంత చెల్లెలు చేస్తున్న వ్యాఖ్యలపై సీఎం జగన్ సమాధానం చెప్పాలన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం : సెల్ ఫోన్ ఛార్జర్ షార్ట్ సర్క్యూట్ తో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఆర్ పురం ఎస్సై రాజ కుల్లాయప్ప కథనం మేరకు.. మండలం లోని ఎన్ ఆర్ పురం గ్రామపంచాయతీ ఎస్ఆర్ పురం గ్రామంలోని ఆనందయ్య మందడి కొడుకు హిమాచల మందడి తమ చెరుకు గానుగుల షెడ్డు వద్ద శనివారం రాత్రి సెల్ ఫోన్ కి ఛార్జింగ్ పెడుతుండగా ఫోన్ ఛార్జింగ్ షార్ట్ సర్క్యూట్ కారణంగా హిమాచల మందడి (37) అక్కడికక్కడే పడిపోయారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు . ఇంట్లో పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుల్లయప్ప తెలిపారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - కార్వేటినగరం: యువకుడు ఆత్మహత్యచేసుకున్న సంఘటన మండల పరిధిలోని పద్మసరస్సు సమీపంలోని మామిడి తోటలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆవుల వెంకట కృష్ణ కథనం మేరకు..మండల పరిధిలోని పాదిరికుప్పం గ్రామానికి చెందిన సాయిసందీప్ (27) చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి చింతమండి వద్ద కొబ్బరి బోండాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే వారు. అతనికి భార్య, 9 నెలల కుమారుడు ఉన్నాడు. అత్యవసర సమయంలో పోలీస్‌స్టేషన్లో డ్రైవర్‌గా వాహనం నడిపేవాడు. ఆదివారం ఉదయం పద్మసరస్సు సమీపంలోని మామిడి తోటలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి సాయిసంధీఫ్ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

టిటిడి చైర్మన్ భూమనను తొలగించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడి చైర్మన్ గా భూమన కరుణాకర్ రెడ్డి తన కుమారుడి గెలుపు కోసం తిరుమల స్థానికులను, టిటిడి ఉద్యోగులను ప్రలోభ పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్న విషయాలపై ఆయన్ను ఎన్నికల సమయం వరకు తొలగించాలని ఎలక్షన్ కమిషన్ కు తిరుపతి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఫిర్యాదు చేశారని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్టాడుతూఓటర్లను ప్రభావితం చేస్తున్నారు అన్న అంశంపై ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేసామే గాని కాంట్రాక్టు కార్మికులకు పెంచిన జీతాలు ఆపాలని, టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఆపాలని ఎక్కడ కూటమి పార్టీలుగా కోరుకోవడం లేదన్నారు. ఇంకా మిగిలిన టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుం టుందన్నారు. కూటమి అభ్యర్థి ఆరని శ్రీనివా సులు ఈసీకి ఇచ్చిన ఫిర్యాదును వక్రీకరించి అబద్ధపు ప్రచారాలు చేయడం శోచనీయమన్నారు. నరసింహ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీటీడీలో జరిగిన అక్రమాలపై విచారణ చేయించి, అక్రమాలు జరిగిన పనులను రీటెండరింగ్ చేస్తామన్నారు.

వైసిపికి

ఏవీఎం శ్రీనివాసులు రాజీనామా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధి. లోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ తిరుమల నగర్ కు చెందిన ఏవీఎం శ్రీనివాసులు వైసిపి క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. తిరుమల నగర్ పరిరక్షణ సేవా సమితిని కూడా వ్యవస్థాపక అధ్యక్షుడి హోదాలో కార్యదర్శి, పెద్దలను సంప్రదించి రద్దు పరుస్తున్నట్లు ప్రకటించారు.



బీజేపీ , మోడీలతో దేశానికి ముప్పు : సిఐటియు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రధాని మోదీలతో దేశానికి ముప్పు ఉందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వంద వాసి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళిలు పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యంతో పాటు లౌకిక వాదాన్ని రక్షించుకోవాలంటే బీజేపీతోపాటు మోడీని అధికారం నుంచి తరిమికొట్టాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ, లౌకికవాదం సామాజిక న్యాయం నీ రక్షించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి బీజేపీ కార్పొరేట్ లకు ధారాదత్తం చేసిందన్నారు. దేశంలో కార్మికుల హక్కులను కాల రాసిందన్నారు . బీజేపీఎన్నికల తర్వాత ఎమ్మెల్యేలను కొని పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను పూర్తిగా అమ్మేస్తున్నారని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను నిర్వీర్యం చేశారని ఆరోపించారు . మోడీ విధానాలకు ఎవరైనా ఎదురుచెబితే జాతీయ దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు చేయిస్తుండడంతో భయం తో ఎవరూ నోరెత్తడం లేదన్నారు. ఇప్పటికే దేశంలో ఇద్దరు సి.ఎం లను అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్ట్ చేశారన్నారు. ఏపీకి కేం ద్రం ప్రత్యేక హోదా, రైల్వేజోన్ వంటివేవీ ఇవ్వకపోగా స్టీల్ ప్లాంట్ ను కార్పొరేట్ లకు ధారాదత్తం చేసిందని విమర్శించారు. సీఎం జగన్ గొప్పల చెప్పుకోవడమే తప్ప దీనిపై మోడీని ప్రశ్నించిన సందర్భం లేదన్నారు. జగన్ కేసులకు భయపడే ప్రధాని మోడీకి సలాం కొడుతున్నాడని విమర్శించారు. జగన్, చంద్రబాబు ఇద్దరు బీజేపీ తో పొత్తులో ఉన్నారు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ని ఓడించి దేశాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివ కుమార్, సీనియర్ నాయకులు టి. వెంకట రామి రెడ్డి , సిఐటియు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, కార్యదర్శి సురేష్ , పామంజి మణి, బి.చంద్రయ్య , గుర్రం రమణయ్య , ఆర్.శ్రీనివాసులు , పుట్టా శంకరయ్య, కె.వి.పి. ఎస్ నాయకులు అడపాల ప్రసాద్ ,ముత్యాలయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి


టిడిపిలో చేరిన వైసిపి ఎంపిటిసి పి కస్తూరి

టిడిపిలో ఎంపిటిసి చేరిక

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: పాకాల మండలంలో వైసిపికి ఆ పార్టీ నేతలు వరుసగా షాక్‌లు ఇస్తున్నారు. తాజాగా పాకాల మండలం, ఇరంగారిపల్లె వైసిపి ఎంపీటీసీ పి కస్తూరి, పి మోహన్, డి వెంకటేసులు, డి గోవిందు, డి మురగయ్య, జగన్నాథం, యోగేష్ చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో ఆదివారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెవిరెడ్డి కుటుంబ పెత్తందారీతనం నచ్చకే వైసిపికి గుడ్ బై చెప్పామన్నారు. పులివర్తి నాని విజయానికి కృషి చేస్తామని తెలిపారు. చెన్నుగారి పల్లి పంచాయతీకి చెందిన వైసీపీ నేతలు శ్రీరాములు రెడ్డి, బాలాజమ్మ, కిరణ్ కుమార్ ఆచారి, గిరి యాదవ్, రాజగోపాల్ రెడ్డి,మదమ్మ, ఉమా,పెరుమాళ్ రెడ్డి, సాయి, ఉదయ్ కుమార్ లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పులివర్తి నాని సమక్షంలో ఆదివారం వారు టిడిపిలో చేరారు. పులివర్తి నాని విజయానికి కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు.

డాలర్ దివాకర్ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, టిడిపిలో చేరిన డాలర్ దివాకర్ రెడ్డిని ఆర్‌సిపురం టిడిపి నేతలు ఆదివారం ఘనంగా సన్మానించారు. తిరుపతిలో దివాకర్ రెడ్డి కార్యాలయంలో ఇ ఉమాపతి నాయుడు, కె నరసింహారెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డిలు కలిసి దుశ్శాలువా, పుష్పగుచ్చాలతో ఘనంగా అభినందించారు. అందరూ కలిసికట్టుగా చంద్రగిరిలో పులివర్తి నానిని గెలిపించుకుందామన్నారు. టిడిపి పథకాలను ప్రజల్లో ప్రచారం చేయాలని డాలర్ దివాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి విజయ్ కుమార్, ఢిల్లీ నాథ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, దినేష్ రెడ్డి, రంజిత్ కుమార్ రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరి మండలంలో వైసిపి నుంచి టిడిపిలో నూతనంగా చేరిన నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త రమణ, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముడుపల్లి సురేష్ రెడ్డి లను ఆదివారం చంద్రగిరి టిడిపి నాయకులు ఐతేపల్లిలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ గౌస్ బాషా, వి సుబ్రహ్మణ్యం నాయుడు, వి రమేష్ రెడ్డి, ధనంజయ రెడ్డి పాల్గొన్నారు.

జనాదరణ ఓర్వలేకనే దాడులు: వైసిపి

ప్రజాశక్తి -కోట : సీఎం వైఎస్ జగన్‌కి ప్రజాక్షేత్రంలో వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేకనే కూటమి దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతున్నారని గూడూరు నియోజకవర్గ యువజన అధ్యక్షులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు, కూటమి ప్రోద్బలంతోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి పై రాళ్లతో దాడి చేశారన్నారు. ఇది పిరికి చర్య అన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రోజురోజుకు పెరుగుతున్న ప్రజాభిమానాన్ని ఓర్వలేక ఇలాంటి దాడులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని చెడగొట్టడం మంచి పద్ధతి కాదన్నారు.

యువశక్తిని చూపించాలి.. భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి

'యువత ఆత్మీయ సమావేశం'లో పులివర్తి నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులు మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ శక్తిని చూపించాలని, తద్వారా భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. ఆదివారం చంద్రగిరి మండలం, ఐతేపల్లిలో టీడీపీ సీనియర్ నేత ఏవి రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో తెలుగు యువత ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడు తూ యువతను మోసం చేసే పార్టీలు, వ్యక్తులు బాగు పడలేదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్, మెగా డిఎస్సీ ఇస్తామని వైసిపి యువతను మోసం చేసిందని ఆరోపించారు. మోసకారి వైసిపి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికలలో ఓటు ద్వారా తరిమి కొట్టాలన్నారు. విద్యావంతులైన యువతీ యువకులు ఎన్నికలలో తనను గెలిపించాలని అభ్యర్థించారు. రేణిగుంట, శ్రీసిటీ లో పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించింది టిడిపియేనని తెలిపారు. కొత్త పరిశ్రమలు రాక, ఉన్న వాటికి వైసిపి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందక పక్క రాష్ట్రాలకు పరిశ్రమలు తరలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి 10 మందిలో ఆరు నుంచి ఏడుగురికి ఉద్యోగ కల్పనకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అమెరికాలో కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలతో చర్చలు జరుపుతున్నామని, తన ప్రయత్నం సత్ఫలితాలను ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ కమిటీ అధ్యక్షుడు ముడిపల్లి సురేష్ రెడ్డి, ఎస్ గౌస్ బాషా, వి రమేష్ రెడ్డి, ఎస్ ధనుంజయ రెడ్డి, నాయకులు, యువత పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి):

గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, ప్రధానంగా క్రికెట్ పట్ల కుర్రాళ్లు విశేష ఆదరణ చూపుతున్నారని ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చంద్రగిరి మండలం ఐతేపల్లి గ్రామంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఆయన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఐతేపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన యువకులు ఉత్సాహ భరితంగా క్రికెట్ ఆడి తమ ప్రతిభను కనబరిచారన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు భవిష్యత్తులో కూడా మరింత శ్రద్ధతో ఆటలు ఆడి నైపుణ్యతను చాటుకోవాలన్నారు. ఓటమి చెందిన క్రికెట్ జట్లు విజయం కోసం ప్రయత్నం చేస్తూ ముందుకు సాగాలన్నారు. క్రీడల వల్ల మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి వున్న విజయం దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దొంగ ఓట్లు వేసేందుకు వస్తే రౌడీషీట్ తెరుస్తారు: ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: 'దొంగ ఓట్లు.. కమిషన్ డబ్బులతో వైసిపి తిరుపతిలో గెలిచేందుకు ప్రయత్నిస్తోందని టిడిపి, బిజెపి బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు. దొంగ ఓట్లు వేసేందుకు వచ్చేవారు కచ్చితంగా శిక్షకు గురవుతారని ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం 33,34 వార్డుల్లో ఆరని శ్రీనివాసులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిశేఖర్ రాయల్ నేతృత్వంలో ప్రచారం నిర్వహించారు. వార్డు అధ్యక్ష కార్యదర్శులు రాజేంద్ర , యువరాజ్ , ప్రసాద్, శ్రీనివాస్ లు పాల్గొన్నారు. సాయంత్రం 45వార్డు లో జరిగిన ఇంటింటి ప్రచారం లో మునిశేఖర్ రాయల్ తో పాటు వార్డు అధ్యక్ష, కార్యదర్శులు లోకనాథం యాదవ్, సుజాతాలు పాల్గొన్నారు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో 34 వేల దొంగ ఓట్లను వైసిపి చేర్పించిందని శ్రీనివాసులు ఆరోపించారు. దొంగ ఓట్లను తొలగించాలని ఎన్నికల సంఘాన్ని ఇప్పటికే డిమాండ్ చేశామని తెలిపారు. అధికారులు దొంగ ఓట్లను అడ్డుకునేందుకు రెడ్ మార్క్ చేస్తున్నారని ఆయన తెలిపారు. ఓటర్లు ఎవరైనా దొంగ ఓటు వేసేందుకు వస్తే ఖచ్చితంగా కఠిన శిక్షను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరి ఓటు వారు వేసుకోవడంలో అభ్యంతరం ఉండదని ఆయన తెలిపారు. దొంగ ఓట్లు వేస్తే మాత్రం రౌడీషీట్ తెరిచేందుకు పోలీసులు వెనకాడరని హెచ్చరించారు. ప్రశాంత తిరుపతి కోసం తనను గెలిపించాలని ఆయన కోరారు. తిరుపతి పార్లమెంట్ కు వరప్రసాద్ ను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సంజయ్, నరసింహ యాదవ్, ఊకా విజయ్ కుమార్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, పులిగోరు మురళి, దంపూరు భాస్కర్, జనసేన చిత్తూరు జిల్లా ఉమ్మడి అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, ఆకేపాటి సుభాషిని, రాజారెడ్డి, ఆనంద్, బత్తిన మధుబాబు బిజెపి నాయకులు పొనగంటి భాస్కర్, వరప్రసాద్, సామంచి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

జగన్ ఆరోగ్యం కుదుటపడాలని పూజలు

ప్రజాశక్తి - క్యాంపస్ :

మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై జరిగిన రాళ్ల దాడి సంఘటన హేయమైన చర్య అని వైయస్ఆర్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు హేమంత్ రెడ్డి అన్నారు. ఆదివారం అలిపిరి శ్రీవారి పాదాల ఎదుట టెంకాయలు కొట్టి, జగన్ ఆరోగ్యం కుదుటపడాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల హృదయాలను చూరగొన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి జనం నీరాజనం పడుతుంటే ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు ఇలాంటి దుర్ఘటనలకు పాల్పడడం దారుణం అన్నారు. రాష్ట్రంలో ప్రజల నుంచి జగన్ కు వస్తున్న ప్రజాదరణ ను చూసి ఈ ఎన్నికలలోను గెలవలేమన్న అక్కసుతోనే రౌడీమూకలతో రాళ్ల దాడి చేయించడం సిగ్గుచేటన్నారు. ఇది ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదన్నారు. దాడి చేసిన వారిని గుర్తించి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హేమంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం నాయకులు కిరణ్ రెడ్డి, సోమశేఖర్, ప్రచార విభాగం కోఆర్డినేటర్ అమరనాథ్ రెడ్డి, విద్యార్థి విభాగం కార్యదర్శి సదాశివ, శరత్ రెడ్డి,రాధాకృష్ణ, తలారి వరుణ్, బోసు,అనిల్ పాల్గొన్నారు.

దళితులను మోసగించిన వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వంపై పులివర్తి నాని ధ్వజం


ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): దళితుల ఓట్లతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులను మోసం చేసిందని చంద్రగిరి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని వైసీపీ ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. ఆదివారం చంద్రగిరిలో దళితులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని మండిపడ్డారు. టిడిపి హయాంలో దళితుల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన 27 సంక్షేమ పథకాలను సీఎం జగన్ మోహన్ రెడ్డి రద్దు చేశారని గుర్తు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుతో ఉన్న విదేశీ విద్యా పథకాన్ని జగనన్న విదేశీ విద్యగా మార్చడం దారుణమన్నారు. తనకు అన్ని కులాలు, మతాల వారు కుటుంబ సభ్యులతో సమానమని పేర్కొన్నారు. చంద్రగిరిలో కూడా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కులాలు మతాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఎవరూ ఎమ్మెల్యే మాయలో పడొద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో దళిత నాయకులు బాదురు ఎల్లయ్య, మాజీ జెడ్పిటిసి అమ్ములు, వేణుగోపాల్, శంకరయ్య దళితులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కి



జోహార్



ప్రజాశక్తి-గూడూరు టౌన్: సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు టి. వెంకట రామి రెడ్డి ఆధ్వర్యంలో సిఐటియు నాయకులు , సీపీఎం నాయకులు కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ బడుగు , బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ అంబేద్కర్ అని కొనియాడారు. ప్రతి ఒక్క రూ ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివ కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పుట్టా శంకరయ్య , సిఐటియు నాయకులు సురేష్ , కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, సీపీఎం నాయకులు, పామంజి మణి, ముత్యాలయ్య, గుర్రం రమణయ్య, చంద్రయ్య, ఆటో యూనియన్ నాయకులు బి.వి.రమణయ్య పాల్గొన్నారు.

గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు మొదటి హరిజన వాడలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానికులతో కలసి వైసీపీ సీనియర్ నాయకులు చేవూరు విజయ మోహన్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు కేక్ కట్ చేసి పంచి పెట్టారు.

టీడీపి కార్యాలయంలో టీడీపి అభ్యర్థి పాశం సునీల్ కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాత బస్ స్టాండ్ , పోస్ట్ ఆఫీసు వద్ద, వాటర్ ట్యాంక్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పలువురు ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చిత్తూరులో సీపీఎం నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా చిత్తూరు అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, జిల్లా నాయకులు సురేంద్రన్, అర్జున్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్ఆర్ పురంలో విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని క్షీర సముద్రం గ్రామంలో దళిత సంఘ నాయకుడు రాజన్, సర్పంచ్ ఐశ్వర్య శేఖర్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని పండుగ వాతావరణంలో ఆవిష్కరించారు. అదేవిధంగా వైసీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. పలు గ్రామాల్లో ప్రజలు అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



తిరుపతి టౌన్: బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రం ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ఆకుల మల్లేశ్వరరావు, వేమన విజ్ఞాన కేంద్రం, జన విజ్ఞాన వేదిక నాయకులు టెంకాయల దామోదరం, సుంకర రెడ్డప్ప, ముని లక్ష్మి, ముఖేష్, రఫీ,రవి, జి బాలసుబ్రహ్మణ్యం, ఈ ఎస్ కుమార్, కలకట రెడ్డప్ప, శ్రీనివాసులు, జనార్ధన్, గురు ప్రసాద్, జ్ఞాన ప్రసూన, మోహన్ నాయుడు, మునిరాజు, మోహన్ రావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు , రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల , తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి , జిల్లా కార్యదర్శులు బండి మధు సూదన్ రెడ్డి, చీళ్ళ సురేష్ , అవనిగడ్డ పద్మజ, తిరుపతి అర్బన్ అధ్యక్షులు హేమాద్రి బాబు , తిరుపతి అర్బన్ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. బాషా, తిరుపతి రూరల్ ప్రధాన కార్యదర్శి బివి రమణ , రేణిగుంట ప్రధాన కార్యదర్శి మురళి, వడమాలపేట ప్రధాన కార్యదర్శి ఇంద్ర ప్రకాష్ , నాయకులు జానకిరామన్, భాస్కర్, ఇతర యూటీఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో: అంబేద్కర్ జయంతి సందర్భంగా తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నేతలు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగాన్ని మనువాద రాజ్యాంగంగా మార్చడానికి మతోన్మాద బిజెపి పూనుకుందన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు టి సుబ్రహ్మణ్యం, ఎం మాధవ్, ఎస్ జై చంద్ర, పి సాయి లక్ష్మి, ఎండి శ్రీనివాసులు, చల్లా వెంకయ్య, అక్బర్, పార్థసారధి రెడ్డి, శేషయ్య, సుజాతమ్మ పాల్గొన్నారు.

రామచంద్రాపురం (చంద్రగిరి): అంబేద్కర్ జయంతి ఉత్సవాలు చంద్రగిరిలో ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి టిడిపి, జనసేన కూటమి నాయకులు దేవర మనోహర్, పురుషోత్తం నాయుడు, వి సుబ్రహ్మణ్యం నాయుడు మురళీధర్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు.

తిరుపతి డెస్క్: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని యర్రావారి పాళెం మండల కేంద్రంలో దళిత సంఘ నాయకులు ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు పల్లెపాక నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు సుండుపల్లి రవి,నాగరాజ, జయేంద్ర, నాగార్జున,నాగరాజమ్మ జగదీష్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని పట్టణంలోని అంబేద్కర్ ట్రస్ట్ కార్యదర్శి అపరంజి, ట్రెజరర్ కుప్పయ్య. ఉద్యోగ సంఘాల నాయకులు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాలసుబ్రహ్మణ్యం, మహేష్, బాబు, గుర్రప్ప, రఘు, ప్రభాకర్, విజయ్ కుమార్, వివిధ దళిత నాయకులు పాల్గొన్నారు .

తిరుపతి డెస్క్: ఏర్పేడు లోని శ్రీకాళహస్తి రోడ్డు వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాచపాలెంలోని వంశి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వికృతి మాల గ్రామం నీలాద్రి అపార్ట్మెంట్స్ శ్రీ లక్ష్మీనరసింహ సేవా ట్రస్ట్ లోని వృద్ధులు, వికలాంగులకు టిఫిన్స్ పంపిణీ చేశారు. **చిన్నగొట్టిగల్లు:** అంబేద్కర్ జయంతిని ఎమ్మార్పియస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేణిగుంట: మండలంలోని కుర్రకాల్వ గ్రామంలో అంబేద్కర్ నాగరాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ తాళ్లపాక దేవరాజులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

యాదమరి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలోని మండల అంబేద్కర్ యువజన సంఘం సైనిక్ సమత సేవాదళ్ అధ్యక్షులు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పూతలపట్టు: అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని ఆయనతోపాటు నాయకులు ఎంపీపీ కుమారి జెడ్పిటిసి దేవిక, జగదీశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి అమర్నాథ్ రెడ్డి, దళిత నాయకులు కలసి రంగంపేట క్రాస్ లోని అంబేత్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిత్తూరుడెస్క్: దళితుల అభ్యున్నతికి పనిచేసిన వ్యక్తి అంబేద్కర్ అని మాజీ ఎమ్మెల్యేలు లలిత కుమారి, సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని బంగారుపాళ్యం మండల కేంద్రం, మొగిలి వెంకటగిరిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నగరిలో మంత్రి రోజా ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

గంగాధర నెల్లూరు: భారత రాజ్యాంగ నిర్మాతకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా మండలంలోని ఎట్టేరి గ్రామంలో గల డాక్టర్ బి.ఆర్అంబేద్కర్‌కు టిడిపి జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి జీడీ నెల్లూరులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గంగవరం: భారత రాజ్యాంగ నిర్మాత, దళిత బలహీన వర్గాల వికాసానికి కృషి చేసిన మహానేత అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ మంత్రి అమర్నాథరెడ్డి పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

కార్వేటినగరం: ప్రపంచ మేదావి, దళిత ఆశా జ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని వైసీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు.

గుడిపల్లి: మండలంలో చీకటపల్లి పంచాయతీ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతిని సర్పంచ్ నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

సదుం: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో వేడుకలు జరిగాయి. ఎంపీపీ యల్లప్ప ఆధ్వర్యంలో అంబేద్కర్‌కి ఘనంగా నివాళులర్పించారు.

ఐరాల: మండలంలోని తిరువణంపల్లిలో మహేష్ స్వేరో, గ్రామస్తులు, యూత్ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పుంగనూరు: ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలు పుంగనూరులో ప్రజాసంఘాలు, వైసీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

పలమనేరు: పలమనేరులో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

రామకుప్పం: మండలంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ సర్కిల్ వద్ద ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు.

తవణంపల్లి: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా తవణంపల్లిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

బైరెడ్డిపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని తీర్థం గ్రామంలో అంబేద్కర్ యూత్ నాయకులు మురళీకృష్ణ, కృష్ణకుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.

పెద్దపంజాణి: దేశంలోని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబాసాహెబ్ అంబేద్కర్ అని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు రెడ్డప్ప అన్నారు. ఆదివారం అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, మండల మాల మహానాడు అధ్యక్షులు మంజునాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

తిరుపతి డెస్క్: కెవిబిపురం మండల సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలాయపల్లి : అంబేద్కర్ జయంతిని మండలంలోని అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ వినయ్, సురేష్, వేణు, సాయి, కిషోర్, అశోక్, సూర్య, మహేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: నారాయణవనం మండల బైపాస్ కూడలిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి సత్యవేడు టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కోనేటి సుమన్ కుమార్, బోస్, భాస్కర్, దాన పరశురాం, ఊరప్ప, ఆర్‌డి గోపాల్, టైలర్ బాబు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవేడు: సిపిఎం మండల నాయకుల ఆధ్వర్యంలో సత్యవేడులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సత్యవేడు మండల కార్యదర్శి ఎం రమేష్ పాల్గొన్నారు.

ఎస్వియు క్యాంపస్ : వ్యవసాయ పాలిటెక్నిక్, ప్రాంతీయ పరిశోధనా స్థానంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మహిళా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి భారతి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. హరే రామ హరే కృష్ణ గ్రౌండ్‌లో అంబేద్కర్ చిత్ర పటానికి ఆ సంఘం జిల్లా కార్యదర్శి రవి ఎస్వి యూనివర్సిటీ లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు అక్బర్, యూనివర్సిటీ అధ్యక్షులు నరేంద్ర, నాయకులు శివ, బాల, పవన్, శ్రీనివాసులు, గణేష్, యూనివర్సిటీ నాయకులు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: పాకాలలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి మండల కేవీపీఎస్ నాయకులు ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే టిడిపి రూటమి అభ్యర్థి పులివర్తి నాని టిడిపి నాయకులు, కార్యకర్తలు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

ఇంటర్‌లో ఏపీఆర్జేసీ విద్యార్థి ఉత్తమ ప్రతిభ



లీలాకృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో కె.వి పల్లి మండలం గారంపల్లి, ఏపీఆర్జేసీలో ఎంపీసీ చదువుతున్న విద్యార్థి వీరసాని లీలాకృష్ణ ఏ గ్రేడ్ తో పాస్ అయ్యారు. వెయ్యి మార్కులకు 933 మార్కులు సాధించినందుకు కళాశాల నిర్వాహకులు లీలాకృష్ణ ప్రతిభను గుర్తించి ప్రత్యేకంగా ప్రశంసించారు.

వైసిపి ర్యాలీలో తోపులాట

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: మండలంలో వైసిపి నాయకులు ఆదివారం నిర్వహించిన ర్యాలీలో ఇరు గ్రూపుల ఘర్షణతో తోపులాట చోటుచేసుకుంది. సూళ్లూరుపేటలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటీ సంజీవయ్య పురవీధుల్లో కార్యకర్తలతో ఆదివారం ప్రచారం నిర్వహిస్తుం డగా వైసిపి నాయకులు కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి గ్రూపు, కళత్తూరు శేఖర్ రెడ్డి గ్రూపు ఒకరి కొకరు ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు జోక్యం చేసుకుని ఇరు గ్రూపులను సమావేశం నుండి వెళ్లగొట్టడంతో వ్యవహారం సద్దుమణిగింది. గతంలో కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డికి శేఖర్ రెడ్డి కి విభేదాలు ఉండేవి. అన్ని సత్యనారాయణ రెడ్డి అనుచరులు, శేఖర్ రెడ్డి అనుచరులు ఘర్షణ పడడంతో ర్యాలీలో గందరగోళం నెలకొంది. అక్కడున్న వైసీపీ నాయకులు ఇరు గ్రూపులను సర్ది గొడవలు లేకుండా అందరూ పార్టీ విజయానికి పని చేయాలని ఘర్షణ పడితే పార్టీ పరిస్థితి దిగజారే అవకాశం వుందని ఆ పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఘర్షణ పడుతున్న వైసిపి నాయకులు



ఆర్అండ్‌బి రోడ్డుకు మరమ్మతుల్లేవ్!

- స్పందించని అధికారులు
- ప్రయాణికులు, విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: కెవిబిపురం మండలంలోని మారుమూల ప్రాంతమైన కోట , మంగాపురం రోడ్డు గతంలో కురిసిన తుపానుకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెళ్లడానికి దారి లేక పడరాని పాట్లు పడుతున్నారు. వాహనదారులు రాత్రి వేళలో వెళ్లాలంటే ఎప్పుడు ఏ పరిస్థితి ఎదురవుతుందోనని భయం గుప్పెట్లో పెట్టుకుని పొలాలపై వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే రోడ్డు లేకపోవడంతో బస్సులు రాక సుమారు ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లి పుత్తూరుకు బస్సు ఎక్కాల్సిన దుస్థితి గ్రామంలో నెలకొంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఏమాత్రం పట్టించు కోవడం లేదని విద్యార్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి ఏర్పాటు చేసి తమ గ్రామానికి బస్సు వచ్చేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతిపక్షాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే సీఎంపై దాడి: అజయ్ కుమార్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిడిపి, జనసేన అధినేతలు తమ కార్యకర్తలకు సీఎం జగన్ పై విరుచుకపడే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలను చేసి వారిని తీవ్రవాదులుగా శిక్షణ ఇచ్చి దాడికి తెగబడేలా చేశారని వైసీపీ తిరుపతి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆరే అజయ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ముఖ్యమంత్రిపై దాడిని ఖండిస్తూ అజయ్ కుమార్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రాత్రి జరిగిన దాడిలో సీఎం నుదుటిపై కాకుండా కనతపై తగిలి ఉంటే సీఎం మరణించే వారన్నారు. సాధారణంగా ప్రతిపక్షాలు ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై విమర్శలు చేయాలే కానీ, వ్యక్తిగతంగా కక్ష సాధింపుగా మాట్లాడడం వలనే కూటమిలోని టిడిపి, జనసేన పార్టీలో కార్యకర్తలు సీఎం జగన్ పై కక్ష సాధింపుగా దాడికి తెగబడ్డారన్నారు. ఈ దాడికి ఈ వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ లపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే సామాన్య ప్రజలకు ఏపీలో రక్షణ ఉండదన్నారు.

కుక్కల బెడద

- కుక్క కాట్లతో ప్రజలు బెంబేలు
- వీధుల్లో పరుగులు తీయాల్సిన పరిస్థితి
- చర్యలు తీసుకోని అధికారులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని 28 పంచాయతీలలో కుక్కలు బెడద అధికమైంది. ప్రజలు బయటకు వెళ్లాలంటే భయాందోళనకు గురి కావాల్సి వస్తోంది. రోడ్డు మీద వెళ్లే పిల్లలను, పెద్దలను, వాహన చోదకులను తరుముకుంటూ దారుణంగా కరుస్తున్నాయి. సైకిల్ మీద, బైకుల మీద ప్రయాణం చేస్తున్న వారిని తరిమి మరీ కరుస్తున్నాయి. మేకపిల్లలు, కోళ్ళు, గొర్రె పిల్లలు దూడలను కూడా ఇవి వదలట్లేదు.. వీటి వల్ల గ్రామాల ప్రజలు ఏ సమయంలో ఏ ముప్పు ముంచుకొస్తుందో తెలియక భయాందోళనకు గురవుతున్నారు. బయటకు వెళ్లాలంటే చేతిలో కర్ర లేదంటే రాయి తీసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మండలంలో చిన్న జంతువులను కూడా మిగల కుండా చేసేస్తాయి. ఇకనైనా మండల స్థాయి అధికారులు, పంచాయతీ సర్పంచులు వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాల్సి వుంది. ముఖ్యంగా ఈ వీధి కుక్కలు బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీలో కొన్ని వేల సంఖ్యలో రోడ్లు మీద తిరుగుతున్నాయి. విద్యార్థులు ఆడుకునే ఆట స్థలంలో ఎక్కువగా ఉంటున్నాయి. ఉదయాన్నే కొంతమంది ఆట స్థలంలో వాకింగ్ చేయాలన్నా కర్ర లేదా రాయి పట్టుకొని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మేజర్ పంచాయతీలోనే ఇలా ఉంటే మిగతా చిన్న చిన్న పంచాయతీల్లో అధికారుల పనితీరు ఎలా ఉంటుందో గమనించవచ్చు. ఇకనైనా అధికారులు స్పందించి జంతువుల ప్రాణాలను, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు. వీటి నివారణకు పంచాయతీ అధికారులు తగిన నియంత్రణ చర్యలు చేపట్టాల్సి వుంది.

ఘనంగా అంబేద్కర్ జయంతి



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్‌పి కృష్ణకాంత్ పటేల్

తిరుపతి సిటీ: అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏఆర్ శ్రీనివాసరావు, డీఎస్పీలు భాస్కర్ రెడ్డి ఎస్బి, రమణయ్య ఏఆర్,ఎస్బి సిఐ శ్రీనివాసులు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, క్యాంపు కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇండియా ఫోరం ఎమ్మెల్యే అభ్యర్థి పోతుగుంట రాజేష్ నాయుడు, సిపిఎం నేతలు అంగేరి పుల్లయ్య, గంధం మణి, సిపిఐ నేతలు జనమాల గురవయ్య, మించల శివకుమార్ పాల్గొన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్ లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అంబేద్కర్ కు నివాళులు అర్పించారు. వైసీపీ నేత పవిత్ర రెడ్డి అంబేద్కర్ కు నివాళి అర్పించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: రుయా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రుయా హాస్పిటల్ అంబద్కేర్ జయంతి వేడుకలను అధికారులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. అనంతరం రుయా ఆస్పత్రి ముందు వైద్య ఉద్యోగులు, బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వెయ్యి మంది రోగులు, ప్రజలకు అన్నదానం, పండ్లు, నీళ్ల బాటిళ్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస జిల్లా అధ్యక్షులు రాజా, నర్సింగ్ సూపరింటెండెంట్, వైద్యులు అన్వేష్, శ్రీకర్ రాజు, హరి నాథ్, హెల్త్ సూపర్ వైసర్ ప్రకాష్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి చేశారని ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ (టెక్నికల్, హెచ్ఆర్డి) ఎన్విఎస్ సుబ్బరాజు తెలిపారు. ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆదివారం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రంలో డైరెక్టర్ సుబ్బరాజు, చీఫ్ జనరల్ మేనేజర్లు పి. అయూబ్ ఖాన్, కె. గురవయ్య, వై. లక్ష్మీనరసయ్య, జనరల్ మేనేజర్లు ఆదిశేషయ్య, మురళి, చంద్రశేఖర్ రెడ్డి, సురేంద్ర రావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల వితరణ

ఎపిఎస్ పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఎపిఎస్ ఇబి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఎన్విఎస్ సుబ్బరాజు చేతుల మీదుగా కార్పొరేట్ కార్యాలయంలో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి. జయరామ్, అదనపు కార్యదర్శి పి. మురళి, ప్రాంతీయ కార్యదర్శి ఐ. సుబ్రమణ్యం, ప్రాంతీయ అధ్యక్షుడు జనార్దన్ రావు, కార్పొరేట్ ఆఫీస్ యూనిట్ కార్యదర్శి జి. అంజనప్ప, డివిజనల్ కార్యదర్శి అభినయ్ పాల్గొన్నారు.

టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మహతి ఆడిటోరియంలో అంబేద్కర్ జయంతిని టీటీడీ ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ పిఆర్వో డాక్టర్ టి.రవి, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, లక్ష్మణ్ నాయక్, దేవేంద్రబాబు, స్నేహలత, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. తిరుపతి పట్టణంలోని వెలసిటీ ఐఐటీ నీట్ అకాడమీ విద్యార్థిని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. అకాడమీ డైరెక్టర్ శజి వీర శేఖర్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు ఘన నివాళులల్పించారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కారనీ మిట్ట గ్రామపంచాయతీలో అంబేద్కర్ జయంతిని కార్నామిట్ట యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపీడబ్ల్యుజెఎఫ్ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుచ్చినాయుడు కండ్రిగ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బొర్రా వేణు పాల్గొన్నారు. వేణు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం వేసవికాలం సందర్భంగా మంచినీటి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్ర ఏర్పాటు చేశారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చిన్న పిల్లలకు నోట్‌బుక్‌లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అనంతరం కారణమెట్ట అంబేద్కర్ అసోసియే న్ యూత్ బొర్రా వేణును శాలువాతో ఘనంగా సత్కరించారు. మండలంలోని పల్లమాల, కనమనంబేడు, కాంపాలెం, బుచ్చినాయుడు కండ్రిగ గ్రామాలలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కోట : కోట మండలంలోని కార్ స్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళాలు అర్పించారు. ఈ కార్యక్రమం లో పలువురు నాయకులు పనబాక కోటేశ్వరరావు, మీజూరు మల్లికార్జునరావు, మీజూరు. మాధవ్, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో కె.వి పల్లి మండలం గారంపల్లి, ఏపీఆర్జేసీలో ఎంపీసీ చదువుతున్న విద్యార్థి వీరసాని లీలాకృష్ణ ఏ గ్రేడ్ తో పాస్ అయ్యారు. 1000 మార్కులకు 933 మార్కులు సాధించినందుకుగాను కళాశాల నిర్వాహకులు లీలాకృష్ణ ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా తిరుపతి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు కరణం హిమ్మత్ ఘన నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో సత్తు మధుసూదన్ యాదవ్, నాగమణి, మహేష్ రాయల్, నాదెళ్ల ప్రసాద్, మునిసుబ్బయ్య, గంగులయ్య, జ్ఞానశేఖర్, వెంకీ నాగేంద్ర బాలరాజు ఉన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా అఖిల భారతీయ యాదవ మహాసభ నాయకులు శంకర్ యాదవ్ ఆయన విగ్రహానికి నివాళులర్పించి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు పలమనేరు అనుకూలం



- ఈ ప్రాంతంలో స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటుకు కృషి చేస్తా..
- యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్.. ఆలోచించి ఓటేయాలి
- గంగవరంలో యువత ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి వ్యాఖ్య

ప్రజాశక్తి-గంగవరం: పరిశ్రమలు, పెట్టుబడులకు పలమనేరు అనుకూలమైన ప్రాంతమని మాజీ మంత్రి అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గంగవరం మండలంలోని గండ్రాజుపల్లి సమీపంలో మండల తెలుగు యువత ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన యువతనుద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించి రాష్ట్ర భవిష్యత్తుకు పునాదులు వేసేలా బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకొస్తే వాటిని పూర్తిగా ఈ ఐదేళ్లలో సీఎం జగన్ నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా తల లేని మొండెంతో పరిపాలన సాగించిన వ్యక్తి జగన్ రెడ్డి అంటూ ఘాటు విమర్శలు చేశారు. చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా రాజధాని పనులు సాగి ఉంటే అక్కడే ఎంతోమంది యువతకు ఉపాధి లభించేదన్నారు.

తాము అధికారంలోకి వస్తే పలమనేరు ప్రాంతంలో స్కిల్ డెవెలప్మెంట్ ఇన్స్టిట్యూట్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని, ఆలోచన చేసి ఓటేయాలని సూచించారు.

సీఎంపై దాడిని ఖండిస్తాం..

"ముఖ్యమంత్రిపై జరిగిన దాడిని ఖండిస్తాం.. అలా అని డ్రామాలకు తెర తీస్తే స్పందించం. ఎన్నికలప్పుడు ఏదో ఒక డ్రామాకు తెర తీస్తావ్.." అంటూ సీఎం జగన్‌పై మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి మండిపడ్డారు. జగన్ రెడ్డి తన చెల్లమ్మలకు, కోడికత్తికి, చిన్నాన్న చావుకు ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

టీడీపీలో చేరిక..

మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి సమక్షంలో ఆదివారం పలువురు టీడీపీలో చేరారు. పలమనేరు మండలం ఓడ్డురు, కోతి గుట్ట, మున్సిపల్ పరిధిలోని గొబ్బిళ్ళకోటూరు, గడ్డురులకు చెందిన 25మంది భాస్కర్ యాదవ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పెద్దపంజాణి మండలం కొలత్తురు పంచాయతీ మద్దలకుంట గ్రామానికి చెందిన 20మంది మండల అధ్యక్షులు ఆనంద్ ఆధ్వర్యంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో ఎస్‌టీ కాలనీవాసులు ఆ సంఘ నాయకులు మునెప్ప, శరవణల ఆధ్వర్యంలో 20మందికి పైగా టిడిపిలో చేరారు. అంబేద్కర్ నగర్ 14వ వార్డ్‌కు చెందిన యువకులు ఎస్సీ నాయకులు గ్యాస్ నాగరాజు, చిన్నిల ఆధ్వర్యంలో 25మంది స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. గంగవరం మండలం గండ్రాజుపల్లిలో జరిగిన ఆత్మీయ సమావేశంలో గంగవరం మండల యువత మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డితోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమని భావించి టిడిపి తీర్థ పుచ్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ గంగవరం మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడు, నాయకులు ప్రతాప్ రెడ్డి, దిలీప్, గిరిధర్ గోపాల్, మదన్‌మోహన్ గౌడ్, మురళి, మంజునాథ్, అశోక్, తులసి, రాకేష్, హరీష్, చందు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యోర్లకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-యాదమరి: మండలం నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను యూటీఫ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన వేణుగోపాల్, సోమశేఖర్, షణ్ముగం పలువురు ఉపాధ్యాయులను యాదమరి మండల కేంద్రంలో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కార్యదర్శి సురేష్, చిత్తూరు జిల్లా కార్యదర్శి పంటపల్లి సురేష్, యాదమరి గౌరవ అధ్యక్షులు ఎంఎం శేఖర్, ప్రధాన సలహాదారు కృష్ణయ్య, సహా అధ్యక్షురాలు రెహనా, మండల అధ్యక్షులు పార్థసారథి, ప్రధాన కార్యదర్శి సర్దార్, ఆర్థి కార్యదర్శి గిరిబాబు, సిపిఎస్ కన్వీనర్ సురేష్, సీనియర్ ఉపాధ్యాయులు ప్రభాకర్ పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు.. అంధకారంలో సోమల

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలలోని బజారు వీధిలో వీధి దీపాలు వెలగక ప్రజలు అంధకారంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ కూడలి నుండి స్థానిక సచివాలయం వరకు ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. నిత్యం జన సంచారం ఉండే ఈ ప్రాంతంలో వీధి దీపాలు వెలగకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ సచివాలయ సిబ్బంది వెంటనే సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఓటు వేద్దాం.. ప్రగతిని చాటుదాం

- కళాజాత బృందాలతో ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఓటు వేద్దాం.. ప్రగతిని చాటుదాం.. అంటూ కళాజాత బృందం నగరంలో విస్తృతంగా ఓటు హక్కుపై అవగాహన కలిగిస్తోంది. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి షగిలి షన్మోహన్, ఆర్వో, జేసీ పి. శ్రీనివాసులు వారి ఆదేశాల మేరకు.. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా.. ఏఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆధ్వర్యంలో నగర పాలక స్వీప్ నోడల్ టీం ఓటు హక్కు ప్రాధాన్యత, ఎథికల్ ఓటింగ్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మాపాక్షి, అనుప్పల్లి పోలింగ్ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో కళాజాత బృందాలతో ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి పౌరుడు తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జానపద పాటలు, బుర్రకథల ద్వారా ఓటు హక్కు ఆవశ్యకత, ఎథికల్ ఓటింగ్‌పై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్వీప్ అసిస్టెంట్ నోడల్ అధికారి చిన్నయ్య, స్వీప్ నోడల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లి పంచాయతీలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా 'మన ఇంటికి మన థామస్' కార్యక్రమాన్ని తెలుగు తమ్ముళ్లు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు కమసాని లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైసీపీ నుంచి కొండకిందపల్లి, తిరుమలయ్యపల్లి, వావిల చేను గ్రామాలకు చెందిన గోవర్ధన్ రెడ్డి, జానకి రామిరెడ్డి, శ్రీరాములు రెడ్డి, హేమాద్రి రెడ్డి, జ్ఞాని, కరుణాకర్, సుగ్రీవ రెడ్డి, రెడ్డిప్పరెడ్డి, చినరాయుడు, ఎర్రసాని గోవర్ధన్ రెడ్డి, పుల్లీప్ రెడ్డి, జగదీశ్, మహేష్ రెడ్డి, నరేష్ రెడ్డి తదితరులు చేరారు.

టీడీపీతోనే అందరికీ సముచిత స్థానం: పులివర్తి

ప్రజాశక్తి-రామచంద్రపురం(తిరుపతి రూరల్): టీడీపీతోనే అందరికీ సముచిత స్థానం ఉంటుందని ఆ పార్టీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తినాని అన్నారు. ఆదివారం తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయితీకి చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం పులివర్తి నాని సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పులివర్తి నానిని చెరుకుల పరంధాంయాదవ్ అనుచరులు గజమాలతో ఘనంగా సత్కరించారు. వేదాంతపురం పంచాయతీకి చెందిన చెరుకుల పరంధామ్ యాదవ్, చెరుకుల వెంకటేష్ యాదవ్, చెరుకుల ఢిల్లీ, చెరుకుల యాదవ్, సాయికుమార్, బాలు, చెరుకుల సాయి, చెరుకుల రాజశేఖర్, చెరుకుల ముని రామ్ తదితరులు టీడీపీలో చేరారు.

ఉత్సవాలు, ఊరేగింపులు, జాతర్లకు అనుమతులు తప్పనిసరి

- ఏఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నగరంలో నిర్వహించే ఉత్సవాలు, ఊరేగింపులు, జాతరలు ఇతరత్రా కార్యక్రమాలకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారుల వద్ద నుండి అనుమతులు పొందాలన్నారు. అనుమతులు లేకుండా ఊరేగింపులు, జాతరలు, ఉత్సవాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తే నిబంధనలు ఉల్లంఘించినట్లు అవుతుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని ఆ ప్రకటనలో తెలిపారు.

రానున్న ఎన్నికల్లో యువతే కీలకం..!

ప్రజాశక్తి-రామకుప్పం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యువతే ప్రధాన కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం తెలుగు యువత సభ్యులతో ఎన్నికల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ యువత పాల్గొని గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమాలను వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి చంద్రబాబును అఖండ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. వైసీపీ పాలనలో చేసిన దాడులు, దౌర్జన్యాలు, భూ ఆక్రమణలు, అక్రమ కేసులతో ప్రజలు విసిగిపోయారన్న విషయాన్ని గుర్తు చేయాలన్నారు. 20లక్షల నిరుద్యోగులకు పరిశ్రమలు స్థాపనతో ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ భృతి అందించి టిడిపి ఆదుకుంటుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి మమేకమై చంద్రబాబును ఆదరించాలని కోరాలన్నారు. కార్యక్రమంలో ఆనంద రెడ్డి, మునస్వామి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, సీతాపతి, సలాం సాబ్, సుబ్రి, వెంకటరమణ, అవినాష్, సతీష్, మంజునాథ్, అమర్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు బలోపేతం చేస్తాం..

- వైసీపి హయాంలో బీసీలకు అన్యాయం
- ప్రశ్నించిన వారిపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టించారు..
- టీడీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్



ప్రజాశక్తి-యాదమరి: చిత్తూరు-గుడియాత్తం అంతరాష్ట్ర రహదారులను అధికారంలో వచ్చిన వెంటనే బలోపేతం చేస్తామని, నూతనంగా రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని టీడీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ అన్నారు. ఆదివారం కొట్టాల గ్రామంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంకు మురళిమోహన్‌తో పాటు చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే.బాబు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళిమోహన్ బీసీలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. పూతలపట్టు నియోజకవర్గంలో ఇప్పటి వరకూ ఏ ఎమ్మెల్యే అయినా అసెంబ్లీలో పూతలపట్టు ప్రజల సమస్యలు ప్రస్తావించరా అంటూ ప్రశ్నించారు. ఎప్పుడూ ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని పూతలపట్టు ప్రజానీకానికి మురళిమోహన్ మాట ఇస్తున్నట్లు చెప్పారు. బీసీలకు ద్రోహం చేసిన పార్టీ వైసీపి ప్రభుత్వమన్నారు. వైసీపి హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని, వారిలో చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమంను చంద్రబాబు నాయుడు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా పార్టీ ఆవిర్భావం నుండి బీసీలకు తెలుగుదేశం పార్టీ సముచిత స్థానం కల్పిస్తూ వచ్చిందన్నారు. ప్రశ్నించిన వారిపై పోలీసుల ద్వారా అక్రమ కేసులు పెట్టి భయాందోళనకు గురి చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావు తనయుడు దగ్గుమళ్ల సుధాకర్, యాదమరి మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబ్బీ, నాయకులు హేమగిరి చిట్టి, వసంత్ కుమార్, యువరాజుల నాయుడు, దొరబాబు చౌదరి, సునీల్ కుమార్ చౌదరి, మురళి నాయుడు, చిత్రా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'



ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుడిపల్లి: రాష్ట్రానికి చంద్రబాబు సీఎం అయితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బాబునాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని కోట చెంబగిరి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీని గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బేటప్ప నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్, నాయకులు హేమంబర్ గౌడ్, చంద్ర, మంజునాథ్, లాయర్ వాసు, రామచంద్రుడు, బాలచంద్ర, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిక



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని ఆరు గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, యువకులు ఆదివారం డిపూటీ సీ ఎం నారాయణస్వామి సమక్షంలో వైసీపీలో చేరారు. ఆదివారం పుత్తూరులోని ఆయన నివాసంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు.

టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: టీడీపీ నగిరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ఆధ్వర్యంలో ఆదివారం పలువురు టీడీపీలో చేరారు. మున్సిపాలిటీ పరిధికి చెందిన 400మంది భాను సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా నగరి రూరల్ మండలం గుండ్రాజుకుప్పం దళితవాడకు చెందిన పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే నిండ్ర మండలం ఇరుగువాయి దళితవాడలో 50 కుటుంబాలు అధికార వైసీపీను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.



ఎన్నికల కోడ్ ధిక్కరణపై కేసు నమోదు


ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-రామకుప్పం: ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా ఎన్నికల కోడ్ ధిక్కరించి ధర్నా చేపట్టిన వారిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు రామకుప్పం ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం బల్ల సర్పంచ్ విజయ్, అతని అనుచరులు 32మంది బల్ల గ్రామంలో ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా రోడ్డుపై ధర్నా చేస్తూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ధిక్కరించి దిష్టిబొమ్మను తగలబెట్టరన్నారు. వారిపై ఎంసీసీ టీం వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పేదింటి విద్యా కుసుమం



ప్రజాశక్తి -బాలాయపల్లి : మండలంలోని నిండలి గ్రామానికి చెందిన షేక్ బాషా మేరీ ఏకైక కుమార్తె షేక్ జరీన ఇంటర్ ఎంపీసీ లో వెయ్యి మార్కులకు 962 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఈనీఈ చదివి గ్రామానికి మంచి పేరుతో పాటు పేదలకు సేవలు అందిస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ఇప్పటి వరకు తాను చదివానని తెలిపారు.

కాపులను ఆదరించింది టిడిపినే

- ఎన్‌డిఏ కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి
- కాపు నేత వంగవీటి రాధ పిలుపు


కార్యక్రమంలో మాట్లాడుతున్న వంగవీటి రాధ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కాపులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించింది టీడీపీనే నని, ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు బలిజ సామాజిక వర్గం కృషి చేయాలని కాపు నేత వంగవీటి మోహనరంగా తనయుడు వంగవీటి రాధా పిలుపునిచ్చారు. ఆదివారం చిత్తూరు మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ ఆధ్వర్యంలో కాపుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

5శాతం రిజర్వేషన్ కల్పించి, కాపులను ఆదరించింది టీడీపీయేనని చెప్పారు. జగన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కాపులం అన్ని రకాల నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కుల సాధన కోసం పనిచేసింది టిడిపియేనన్నారు. ఈ నేపథ్యంలో కాపులంతా ఏకతాటిపైకి వచ్చి కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించి, కాపుల సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. చిత్తూరు మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బలిజలు అన్ని విధాలుగా నష్టపోయారని ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించి బలిజ సత్తా చాటాలని చెప్పారు. చిత్తూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి ప్రసాదరావు మాట్లాడుతూ కాపుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి పలు రకాల రుణాలు అందించి కాపులకు ఆర్థిక స్వావలంబన చేకూర్చిన ఘనత టీడీపీదేనని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు చూసి పవన్‌కళ్యాణ్ ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని కంకణం కట్టుకున్నారని కావున కాపులు ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ కాపుల హక్కులను పరిరక్షించేందుకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. తాము కల్లబొల్లి మాటలు చెప్పమని, ఇచ్చిన మాటకు కట్టుబడి చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. చిత్తూరు నియోజకవర్గం ప్రజలకు తాము ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంధకారంలో ఉండే రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం కూటమి బలపరించిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మేయర్ హేమలత, టిడిపి నేతలు బద్రీనాథ్, కాజూరు బాలాజీ, జనసేన నేత యశ్వంత్, పలువు జనసేన టిడిపి కార్యకర్తలతో పాటు బలిజ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

కరోటిడ్ సర్జరీతో స్ట్రోక్ నివారణ

అపోలో హాస్పిటల్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ బాలాజీ వెల్లడి



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: స్ట్రోక్ తో బాధపడుతున్న రోగులకు కరోటిడ్ సర్జరీ ద్వారా వ్యాధిని నయం చేయవచ్చని చెన్నైకి చెందిన అపోలో హాస్పిటల్ వాస్కులర్ సర్జన్ బాలాజీ తెలిపారు. ఆదివారం తిరుచానూరు రోడ్డు సమీపంలోని అపోలో క్లినిక్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ భారతదేశంలో అనేక మంది స్ట్రోక్ తో బాధపడుతున్నారని సకాలంలో చికిత్స తీసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చన్నారు. ఇటీవల కాలంలో చెన్నై అపోలో ఆసుపత్రిలో స్ట్రోక్ తో బాధపడే రోగులకు మెరుగైన చికిత్సను అందించామన్నారు. వారందరూ ఆరోగ్యంగా వున్నారని తెలిపారు. ఈ వ్యాధి మెదడు రక్త సరఫరా లో అడ్డుపడటం లేదా మెదడు లోపల రక్తస్రావం కారణంగా స్ట్రోక్ వస్తుందని చెప్పారు. మెదడుకు వెళ్లే రక్తనాళం లో అడ్డంకులు ఏర్పడి స్ట్రోక్ ను నివారించవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియను కరోటిడ్ ఎండార్ట్ రెక్టామి అని కూడా అంటారని పేర్కొన్నారు. స్ట్రోక్ ఎక్కువగా 50 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాలు లోపు ఉన్నవారికి వస్తుందని వెల్లడించారు. వ్యాధి రావడానికి కారణం వయసు తో పాటు మధుమేహం, ధూమపానం హైపర్ టెన్షన్ అధిక కొలెస్ట్రాల్ కారణాల వల్ల వస్తుందని పేర్కొన్నారు. చెన్నై అపోలో ఆసుపత్రిలో తక్కువ ధరకే ఈ వ్యాధి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు.

జగన్‌పై దాడిని ఖండిస్తూ నిరసనలు


బంగారుపాళ్యంలో

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: నిన్న రాత్రి విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మీద జరిగిన దాడి, చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేసిన హత్యాయత్నమేనని టీటీడీ ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. స్థానిక జీవకోనలో నడిరోడ్డుపై బైఠాయించి ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈమధ్య వాళ్లిద్దరూ ఏవేదిక మీదైనా మైకులెత్తుకుని మాట్లాడినా జగన్ అంతుచూస్తాం, జగన్ పని ఇక అయిపోయిందని అంటున్నారు. తమ కార్యకర్తలను, గూండాలను రెచ్చగొట్టే మాటలే చెబుతూ వస్తున్నారు. ఆ క్రమంలోనే విజయవాడలో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మీద దాడి జరిగిందని, ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి మీద జరిగిన హత్యాయత్నమే, దీనికి కారణం చంద్రబాబు పవన్ కళ్యాణ్‌లే అని, ఈ హత్య రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, చంద్రబాబు గత చరిత్ర అంతా రక్తంతో తడిసిందే అన్నారు. అందులో భాగస్వామిగా పవన్ కళ్యాణ్‌ని కూడా చేర్చుకున్నాడు. జగన్‌రెడ్డిని నేరుగా రాజకీయల్లో ఎదుర్కొనే శక్తిలేక, భౌతికంగా అంతమొందించే కుట్ర చేశారని ధ్వజమెత్తారు. పేద ప్రజల గుండెల్లో కొలువై ఉన్న మహా నాయకుడు వైఎస్ జగన్‌కు ఏదైన ప్రమాదం పొంచి ఉందని రాష్ట్ర ప్రజలంతా భయపడుతున్నారు. మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అభినయ్ రెడ్డి, రాజేంద్ర, అజయ్ కుమార్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కోట: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై జరిగిన దాడి బాధాకరమని వైసిపి మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి అన్నారు. జగన్‌పై ప్రజలకున్న ఆదరణను చూసి ఓర్వలేని కిరాతకులు నిన్నటి దినం బెజవాడలో బస్సు యాత్రలో వున్న జగన్ మీద కావాలనే ఉద్దేశపూర్వకంగా భౌతికదాడులు చేశారని, అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారని ఈ విధమైన భౌతిక దాడులు మంచి పద్ధతి కాదన్నారు.


నారాయణవనంలో

నారాయణవనం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై దాడి టీడీపీ పిరికిపంద చర్యలు అని సత్యవేడు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే నూక తోటి రాజేష్ అన్నారు. నారాయణవనం బైపాస్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కూడలిలో కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపిపి దివాకర్ రెడ్డి, లక్ష్మణ్, గుణశేఖర్, అన్నాదురై, ఏళుమలై, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పూతలపట్టు: ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కుట్రలో భాగమే


ఎస్ఆర్ పురంలో

ముఖ్యమంత్రి జగన్‌పై దాడి అని పూతలపట్టు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ ఆరోపించారు. జగన్‌పై దాడికి నిరసనగా ఆదివారం పూతలపట్టు మండలంలోని నాయకులు అంబేద్కర్ సర్కిల్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. ఎంపీపీ కుమారి, జెడ్పిటిసి దేవికా, బాబురెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్ దాడిని ఖండిస్తూ... నిరసన చేసిన వైఎస్ఆర్ నాయకులు

ఎస్ఆర్ పురం: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై శనివారం జరిగిన దాడిని ఖండిస్తూ స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్య, నియోజకవర్గ బలిజ సంఘం అధ్యక్షులు విజయబాబు ఆధ్వర్యంలో చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై వైసిపి నాయకులు నిరసన చేపట్టారు. జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, కన్వీనర్ మణి, కుప్పయ్య, జనార్ధన్, మహేష్‌బాబు, హరిరెడ్డి, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాదారణ ఓర్వలేకే దాడులు

ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్

పూతలపట్టు: ప్రజాదారణ ఓర్వలేకే జగన్మోహన్ రెడ్డిపై దాడులను అని పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం అంబేద్కర్ విగ్రహం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు నల్ల రిబ్బన్‌తో నిరసన తెలిపారు. మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షులు సర్దార్ పాల్గొన్నారు.

ఎలక్షన్ కమిషన్ విచారణ చేపట్టాలి

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్

గూడూరు టౌన్: సీఎం జగన్‌పై జరిగిన దాడిని నిష్పక్షపాతంగా ఎలక్షన్ కమిషన్ విచారణ చేపట్టాలని టిడిపి అభ్యర్థి పాశం సునీల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోడికత్తి డ్రామాలో దళిత యువకుడు శ్రీనుని జైలు పాలు చేశారనీ, శవ రాజకీయం కోసం అవ్వా తాతల ప్రాణాలు తీశారని విమర్శించారు. సీఎం జగన్‌పై గులకరాయి దాడిపై ఎలక్షన్ కమిషన్ నిష్పక్షపాతం విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే రాళ్ల దాడి

- పార్లమెంటు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే రాళ్లదాడి డ్రామాకు వైసిపి నాయకులు తెరతీసారని ఎన్డీఏ కూటమి చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు వ్యాఖ్యానించారు. సింపతి గేమ్స్ ఆడొద్దు అంటూ ఎద్దేవా చేశారు. ఆదివారం చిత్తూరు టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన టిడిపి నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు వచ్చాయంటే సీఎం జగన్ ఇలాంటి నాటకాలాడడం పరిపాటి అయిందన్నారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మరని, తానేదో చెప్పుకొని రాజకీయాల్లో గెలవాలి గాని ఇలాంటి అడ్డదారులు తొక్కడం కరెక్ట్ కాదన్నారు. అనంతరం చిత్తూరు టిడిపి పార్లమెంటు అధ్యక్షులు సిఆర్.రాజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు గాలిలో దీపంలా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కేంద్రహోంశాఖ దృష్టి సారించి, రాళ్లదాడి జరిగిన తీరుతెన్నులపై విచారణ చేసి నిజానిజాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కోదండ యాదవ్, సురేంద్ర కుమార్ మోహన్ రాజ్ సప్తగిరి ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి ఎంపీ అభ్యర్థి ప్రసాద్ రావు